క్లుప్తంగా

పక్కాగా అభివృద్ధి పనులు

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ అభివృద్ధి పనులు పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో శ్యామలాకుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో గురువారం సమావేశమైన ఆమె అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రతీ గ్రామపంచాయతీలో విధిగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో గ్రామీణులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు



ట్రాక్టర్‌లో కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్న ధాన్యం బస్తాలు

రేగిడి: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని ఏవో మురళీకృష్ణ అన్నారు. మండలంలోని అంబఖండి, చాటాయివలస, వన్నలి, లింగాలవలస, వావిలవలస గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన అక్కడి రైతులతో కాసేపు మాట్లాడారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి, విక్రయించాలన్నారు. ఇప్పటివరకు 577 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



ప్రశ్నలడిగి విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

వంగర: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల బోధనాతీరు పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు అంచనా వేశారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు.

తపాలా ఉద్యోగుల ధర్నా

రామభద్రపురం: కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ స్థానిక పోస్టాఫీస్ వద్ద గ్రామీణ తపాలా ఉద్యోగులు గురువారం ధర్నా చేపట్టారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను వెంటనే అమలుచేయాలని, రెగ్యులర్ తపాలా ఉద్యోగులకు ఇచ్చిన వెయిటేజీ, ఇంక్రిమెంట్స్ బంచింగ్ ఇవ్వాలన్నారు. 8 గంటల పని, పెన్షన్ ప్రయోజనాలు కల్పించాలన్నారు. గ్రూపు ఇన్స్యూరెన్స్ కవరేజి రూ.5 లక్షల వరకు పెంచాలని, డిపార్ట్‌మెంట్ సిబ్బందితో సమానంగా జీడీఎస్ గ్రాట్యుటీ పెంచాలని, పెయిడ్ లీవ్‌లను 180 రోజుల వరకు దాచుకుని, నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఏ సర్వేశ్వరరావు, ఎం.శంకరరావు, జి.శ్రీనివాసరావు, కె.వెంకటరావు, పి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

నేడు కూనాయవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

మున్సిపల్ డీఈఈగా కనకరాజు

బొబ్బిలి: మున్సిపల్ డీఈఈగా కనకరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అందరి సహాయసహకారాలతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

40 యూనిట్ల రక్తం సేకరణ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల నుంచి 40 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెడ్డి మోహనరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు వారోత్సవాలు

బొబ్బిలి: స్థానిక ఏపీఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో విద్యుత్ పొదుపు వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈఈ ఆవాల అనంతరావు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు ఎలా వాడితే తక్కువ విద్యుత్ ఖర్చు అవుతుందన్న విషయాలపై చైతన్యం కల్పించడం జరుగుతుందన్నారు.

జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమంతో గ్రామాలు జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలు వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు గురువారం ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు అని, గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటేసి, గెలిపించాలని కోరారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుండడం విశేషం.

–సాక్షి నెట్‌వర్క్.



రామభద్రపురం: జన్నివలస సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సరస్వతి, తదితరులు



రాజాం: ఒమ్మిలో ప్రభుత్వ పథకాల బోర్డు ప్రారంభించిన పార్టీ మండల అధ్యక్షుడు రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు



రేగిడి: చిన్నశిర్లాంలో కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జగన్మోహనరావు, సర్పంచ్ ఉమాపాపినాయుడు



బొబ్బిలి: శివడవలసలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ శాంతకుమారి, జేసీఎస్ ఇన్‌చార్జ్ దామోదరరావు



సంతకవిటి: సిరిపురంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల బోర్డు వద్ద సర్పంచ్ తిరుపతి, తదితరులు

ఆడుదాం ఆంధ్రా కిట్లు పంపిణీ

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల కిట్లను ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు చేతులమీదుగా గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఈ కార్యక్రమం చేపడుతోందని, పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సహవంతులైన యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు

సీబీఎం పరిచర్యకు 150 ఏళ్లు

బొబ్బిలి: రాష్ట్రంలో సీబీఎం పరిచర్యకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక చర్చి సెంటర్ వద్ద బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ డైమండ్ జూబ్లీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా చర్చి, కౌన్సిల్ ఏర్పాటు, ముఖ్య ఉద్దేశ్యం, లక్ష్యాలను పాస్టర్లు వివరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడును కౌన్సిల్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు విజయకుమార్, అధ్యక్షుడు జార్జ్ ఎబినేజర్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యతలను సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డు సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందివ్వాలని తెలిపారు. రికార్డుల నిర్వహణ కూడా సక్రమంగా చేపట్టాలన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు



విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో బ్రహ్మాజీరావు

బొబ్బిలి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందివ్వాలని డిప్యూటీ డీఈవో పి.బ్రహ్మజీరావు సూచించారు. గురువారం మండలంలోని నారసింహునిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థులకు అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం అందివ్వాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, చదువులో వెనకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

తెలుగు మహాసభలను జయప్రదం చేయండి

రాజాం సిటీ: రాజమండ్రిలో జనవరి 5, 6, 7వ తేదీల్లో జరిగే రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రచార కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఓ సమావేశంలో విద్యార్థులనుద్దేశించి కాసేపు మాట్లాడారు. రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నాయన్నారు. ఈ సభలు కవితాపఠనం, చర్చాగోష్టి, కళలు, పుస్తక, సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్య రూపకాలతో అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. తెలుగు తల్లి వైభవాన్ని దశదిశలా వ్యాప్తికి ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులంతా హాజరుకావాలన్నారు. అనంతరం సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.స్వప్నహైందవి, రాజాం రచయితల వేదిక నిర్వాహకులు జి.రంగనాథం తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రచార కార్యదర్శి సూర్యలక్ష్మి, తదితరులు

యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

- అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం
- కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవోల చర్యలు
- సచివాలయ ఉద్యోగులతో యథావిధిగా కార్యకలాపాలు



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీవో రమామణి



సంతకవిటి: లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రామభద్రపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెబాటపట్టిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో రమామణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఎంఈవో తిరుమలప్రసాద్, ఏపీఎం రత్నాకర్‌తో గురువారం సమావేశమైన ఆమె సచివాలయ కార్యదర్శులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిలో ఒకరిని ఫంక్షనల్ అసిస్టెంట్‌గా నియమించి, శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. ఫంక్షనల్ అసిస్టెంట్లు ముందుగా కేంద్రాల్లోని స్టాక్ నమోదు చేసుకుని, వలంటీర్ల సహకారంతో టీహెచ్ఆర్ పంపిణీ చేపట్టాలన్నారు. కేంద్రాల్లో చిన్నారులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మెర్జ్(కలిపిన) చేసిన కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులను నియమించి, మధ్యాహ్న భోజనం వండిస్తామని, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బాడంగి: అంగన్‌వాడీల సమ్మెతో కేంద్రాలు మూతపడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. సచివాలయ సిబ్బందిలో ఒకరిని అంగన్‌వాడీ కేంద్రానికి నియమించి, వారితో కేంద్రాల నిర్వహణ చేపట్టనుంది. ఇదే విషయమై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

సంతకవిటి: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండడంతో మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో రవికుమార్, ఐసీడీఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది, పోలీసులు గురువారం తెరిచి, లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు.

వంగర: మండలంలోని వంగర, ఎం.సీతారాంపురం ,తలగాం, మడ్డువలస, జగన్నాథవలస గ్రామాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీవో లోపింటి త్రినాథ్ ఆధ్వర్యంలో మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచి, యథావిధిగా కార్యకలాపాలు నిర్వహించారు.

రేగిడి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్ తదితర అధికారులు గురువారం తెరిపించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న కారణంగా సచివాలయ ఉద్యోగులతో కేంద్రాల తాళాలు తెరిపించి, కార్యక్రమాలు నిర్వహించారు.

రాజాం: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలకు వేసిన తాళాలను ఐసీడీఎస్ అధికారులు, రెవెన్యూ అధికారులు గురువారం తీయించి, యథావిధిగా కార్యక్రమాలు నిర్వహించారు.

రాజాం సిటీ: మండలంలోని రాజయ్యపేటలో అంగన్‌వాడీ కేంద్రం–2ను అధికారుల సమక్షంలో గురువారం తెరిచి, కార్యకలాపాలు నిర్వహించారు.

బొబ్బిలి: మండలంలోని 30 అంగన్‌వాడీ కేంద్రాలు గురువారం యథావిధిగా తెరిచి, కార్యకలాపాలు నిర్వహించారు.



రాజాం సిటీ: రాజయ్యపేటలో అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని తెరుస్తున్న అధికారులు



వంగర: మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం తాళాలు తీయిస్తున్న అధికారులు



రేగిడి: ఆమదాలవలస-1 అంగన్‌వాడీ కేంద్రం తాళాలు తీయిస్తున్న ఎంపీడీవో శ్యామలకుమారి



రాజాం: దోలపేట అంగన్‌వాడీ కేంద్రం తాళాలు తెరిపిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్యాసమ్మ

• స్వాగతం.. సుస్వాగతం!





శ్రీకాకుళం జిల్లా, పలాసలో డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైఎస్సార్ సుజలధార ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బొబ్బిలి, రాజాం, పాలకొండ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కంబాల జోగులు, విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలిసి, సాదరస్వాగతం పలికారు.

ఎమ్మెల్యేపై ఎల్లోమీడియా దుష్ప్రచారం తగదు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు లక్షుంనాయుడు



ఎమ్మెల్యే శంబంగిపై ఎల్లోమీడియాలో వచ్చిన తప్పుడు వార్తను ఖండిస్తున్న ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాదిగ

- జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు లక్షుంనాయుడు

రామభద్రపురం: ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అంగన్‌వాడీ కార్యకర్తలను అనని మాటలను ఆయన అన్నారని ఎల్లోమీడియా(ఆంధ్ర జ్యోతి)దుష్ప్రచారం చేయడం తగదని జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్షుంనాయుడు అన్నారు. మండలంలోని కొట్టక్కి గ్రామంలో గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలను ఉద్దేశించి, ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేశారని, రిపోర్టర్ మనసులో ఉన్న మాటలను రాయడం, దానిని ఆ పత్రిక ప్రచురించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏం మాట్లాడారో తెలుసుకుని, పత్రికలో రాయాలని సూచించారు. కొట్టక్కిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పలువురు మీడియా సోదరులు హాజరయ్యారని, వారి దగ్గర అనని మాటలు ఒక్క ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌తోనే అన్నట్లు, ఆ పత్రిక ప్రచురించడం తగదన్నారు. ఎమ్మెల్యే శంబంగికి మహిళలంటే అపారమైన గౌరవమన్నారు. ఇటీవల ఆ పత్రిక రిపోర్టర్ అవినీతికి పాల్పడ్డాడని యాజమాన్యం తొలగించారని, మళ్లీ టీడీపీ నేతల కాళ్లు పట్టుకుని బతిమలాడితే ఉద్యోగంలోకి తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేతల మెప్పు పొందేందుకు ఇలాంటి వార్తలు రాసిన వారికి విజ్ఞత లేదన్నారు. మరోసారి ఇలాంటి కల్పితాలు రాస్తే పరువునష్టం దావా వేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, జన్నివలస సర్పంచ్ సారంగదొర తదితరులు పాల్గొన్నారు.

విలేకరిని తొలగించాలి..

రామభద్రపురం: ధర్నాలు చేపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎల్లోమీడియా(ఆంధ్రజోతి) ప్రచురించిన తప్పుడు రాతలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్ మాదిగ అన్నారు. గురువారం మండలంలోని ఆరికతోటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కొట్టక్కిలో జరిగిన ఓ కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎమ్మెల్యే అనుచిత వాఖ్యలు చేశారని ఓ పత్రిక వక్రీకరిస్తూ రాయడం, దానికి సీపీఎం, సీఐటీయూ రాద్ధాంతాలు, నిరసనలు చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన ఎమ్మెల్యే శంబంగి మహిళలతో పాటు అన్ని పార్టీల వారిని గౌరవిస్తారని, మహిళల పట్ల ఆయన ఏనాడూ అనుచిత వ్యాఖ్యలు చేయడం గానీ, అనుచితంగా ప్రవర్తించడం గానీ తామెప్పుడూ చూడలేదన్నారు. తప్పుడు రాతలు రాసిన విలేకరిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొబ్బిలి: స్థానిక పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు చేతులమీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేత వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

సంక్షిప్తంగా...

అంతరపంటలతో అధిక ఆదాయం



పాగిరిలో కూరగాయల సాగును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ: అంతరపంటలతో అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాగిరి గ్రామంలో సాగు చేస్తున్న కూరగాయల పంటలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం అంతరపంటల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కూరగాయలు, ఆకుకూరలు వంటి పంటలను ప్రధాన పంటల్లో అంతరపంటలుగా వేసుకోవడం ద్వారా నేలగుల్లబారడంతో పాటు నేలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. ఇలా చేయడం ద్వారా విత్తన ఖర్చు తగ్గడంతో పాటు ఆదాయం అధికంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పాత్రుని వెంకటరమణ, నిర్మల, శార్వాని, రైతులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి రాజాం రహదారి విస్తరణ పనులు

రాజాం: శ్రీకాకుళం జిల్లా, పలాసలో డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైఎస్సార్ సుజలధార ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కంబాల జోగులు కలిసి, స్వాగతం పలికారు. అనంతరం రాజాం ప్రధాన రహదారి విస్తరణ పనుల జాప్యాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. రూ.5.97 కోట్ల తొలి విడత బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరగా, స్పందించిన ముఖ్యమంత్రి నిధుల విడుదలకు అధికారులను ఆదేశించారు. రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

రాజాం సిటీ: రోడ్లపై ప్రయాణించే వారంతా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక చైతన్య పాఠశాల విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం చేపట్టి, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు రోజా పువ్వు అందించారు. సెల్‌ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయకూడదని, అతివేగంతో ప్రయాణించకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు, లైసెన్స్ కూడా వెంట తీసుకురావాలన్నారు.